క్లుప్తంగా

వైశాఖ మాస పూజలు



జగ్గయ్యపేట అర్బన్: వైశాఖ మాసం సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అద్దాలబజారులో వేంచేసియున్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో ఆగ్రహారం గ్రామానికి చెందిన ఎర్రపోతు పవన్‌కుమార్ దంపతులచే లక్ష మల్లెల పూజ, వైశాఖ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తట్టు, రుబెల్లాపై ప్రత్యేక డ్రైవ్

నందిగామరూరల్: తట్టు, రుబెల్లాపై ఈనెల 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు లింగాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కామేశ్వరి సోమవారం తెలిపారు. తొమ్మిది నుంచి 12 నెలలు, 16–24 నెలల వయసు కలిగిన చిన్నారులకు విధిగా తట్టు, రుబెల్లా టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. టీకాలు వేయించేందుకు ఆశ వర్కర్, ఏఎన్‌ఎంలతోపాటు గ్రామంలోని ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్‌లు గ్రామాల్లో అందుబాటులో ఉండి చిన్నారులకు టీకాలు వేయాలని ఆదేశించారు.

అర్జీ అందజేత

కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యశ్రీ కార్డులో కుటుంబసభ్యుల పేర్లు చేర్చాలని కోరుతూ ఓ వ్యక్తి అర్జీ అందజేయగా, అర్జీని త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఏపీఓ రమాదేవి, ఏపీఓం శ్రీనివాసరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక వర్క్ షాపు

నందిగామ రూరల్: జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం భవనంలో మంగళవారం జిల్లాస్థాయిలో రుతు పరిశుభ్రత, పోషకాహారంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి సీడీపీవో కృష్ణకుమారి సోమవారం తెలిపారు. టాటా ట్రస్ట్ సహకారంతో నిర్వహించే ఈ వర్క్‌షాప్‌లో అంగనవాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొనాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఓ ఇంటిపై ఏసీ రిపేర్ చేస్తున్న యువకుడు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గాయాల పాలయ్యాడు. కొండపల్లి 10వ వార్డులో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు కొండపల్లి గ్రామానికి చెందిన యువకుడు హిదయతుల్లా ఏసీ మెకానిక్‌గా పని చేస్తాడు. ఓ ఇంటిపై ఏసీ రిపేర్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైయ్యాడు. ఇంటిపైన ఏసీ ఔటర్ పైపు పైకి తీస్తున్న క్రమంలో ఇంటి సమీపంలో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు పైపు తగలడం వలన ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అతని వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన సమీపంలోని వైద్యశాలకు తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాపాయం తప్పింది.

సారా, మద్యం విక్రేతల అరెస్ట్

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని విస్సన్నపేట మండలం కొర్రా తండాలో సారా తయారీకి సిద్ధం చేసిన 50 లీటర్ల బెల్లపుఊటను ఎక్సైజ్ అధికారులు సోమవారం ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న కొర్రా నాగేశ్వరరావును అరెస్ట్ చేసి తిరువూరు కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నిక్సన్ తెలిపారు. తిరువూరు రాజుపేటలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న తోట హరీష్, ముప్పా సాంబశివరావు నుంచి 26 మద్యం సీసాలు స్వాధీనపరచుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వెంకటకుమార్, కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తిపరమైన వ్యాధులను అధిగమించాలి



ఇబ్రహీంపట్నం: ఉద్యోగులకు వృత్తిపరంగా సంభవించే వ్యాధులను అధిగమించాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ శివ రామాంజనేయులు తెలిపారు. ఎన్టీటీపీఎస్‌లో ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం, సంపూర్ణ పోషకాహారం తీసుకోవడం, ఒత్తిడిని దూరం చేయడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. ఇటువంటి వైద్య శిబిరాల ద్వారా మనకు తెలియని వ్యాధులు బయటపడితే పూర్తిస్థాయి వైద్యం తీసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. 550 మంది ఉద్యోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గాడి తప్పిన పేట పురపాలన

- ఖాళీగా కీలక పోస్టులు..
- సెలవులో కొందరు ఉద్యోగులు
- బదిలీలతో కొన్ని సీట్లు ఖాళీ
- నెలల తరబడి భర్తీకి నోచుకోని పోస్టులు
- స్తంభించిన పురపాలన
- చోద్యం చూస్తున్న పాలకులు



జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయం

జగ్గయ్యపేటఅర్బన్:జగ్గయ్యపేట మున్సిపాలిటీలో పాలన అస్తవ్యస్తంగా మారింది. వైఎస్సార్ సీపీ తరపున మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన రంగాపురం రాఘవేంద్ర, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏమాత్రం నైతికతను పాటించకుండా కేవలం అధికారమే పరమావధిగా టీడీపీలో చేరారు. ఈ క్రమంలో ఆయన తన పదవిని కాపాడుకునేందుకు టీడీపీ వారికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుండటం రాజకీయ వర్గాల్లో తీవ్ర వివాదస్పదమవుతోంది.

ఖాళీగా దర్శనమిస్తున్న ఉద్యోగుల సీట్లు..

పురపాలక సంఘ కార్యాలయంలో పలువురు అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ కావడం, దీర్ఘకాలిక సెలవులో ఉంటుండటంతో పురపాలన స్తంభించిపోయింది. ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. తనతల్లి అనారోగ్యం రీత్యా టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీవో) మూడు నెలలుగా లీవ్‌లో ఉండగా, ఈ విభాగంలో కార్యకలాపాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇక ముఖ్యమైన పారిశద్ధ్య విభాగాన్ని పర్యవేక్షించే శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రమోషన్‌పై ఏలూరు జిల్లా చింతలపూడి మున్సిపాలిటీకి బదిలీకాగా, ఆస్థానం నెలరోజులుగా ఖాళీగా ఉంది. దీంతో పట్టణంలో పారిశుద్ధ్య విభాగాన్ని పర్యవేక్షించే వారే కరువై పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. ఇక మున్సిపల్ ఏఈ, హెల్త్ అసిస్టెంట్ సీట్లు కొద్దినెలలుగా ఖాళీగా ఉన్నాయి. ఆరునెలలుగా ఖాళీగా ఉన్న మున్సిపల్ మేనేజర్ పోస్టు పదిరోజుల కిందట భర్తీ అయ్యింది. ఇక మున్సిపల్ కమిషనర్ కూడా ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇక 11మంది అటెండర్లలో కనీసం సగం మంది ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారో తెలియని పరిస్థితి. దీంతో ఆయా పనులపై మున్సిపల్ కార్యాలయానికి వచ్చే పట్టణ ప్రజలకు కనీసం సమాధానం చెప్పే వారు కూడా కరువయ్యారు.

లోపించిన పర్యవేక్షణ..

మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది కొరతతోపాటు పట్టణంలోని 14 సచివాలయాలను కూడా సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో వార్డుల్లో ఆయా పనుల పర్యవేక్షణ లోపించింది. వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోగా, వాటి నియంత్రణ మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. మున్సిపల్ పరిధిలో అనేకచోట్ల అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నప్పటికీ మున్సిపల్ సిబ్బంది చోద్యం చూస్తున్నారు. మున్సిపల్ పాలనను గాడిలో పెట్టడంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర విఫలమయ్యారనే చర్చ రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది. అనైతిక రాజకీయాలతో తన పదవిని కాపాడుకునేందుకు చూపించే శ్రద్ధలో కొంతైనా మున్సిపల్ పాలనపై పెడితే బాగుండేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా మున్సిపాలిటీలోని అనేక పోస్టుల్లో ఉద్యోగులు లేకపోగా, మున్సిపల్‌చైర్మన్ సైతం పురపాలనను గాడిలో పెట్టడంలో విఫలంకావడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ స్పందించి పురపాలనను గాడిలో పెట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగుల కొరత, గాడితప్పిన పురపాలనపై మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావును వివరణ కోరగా..పురపాలక సంఘ కార్యాలయంలో ముఖ్యమైన శాఖలు చూసే అధికారులు లేకపోవడం నిజమేనన్నారు. ఈవిషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలోనే ఆయా పోస్టులు భర్తీ అవుతాయని చెప్పారు. జూన్ నెల నుంచి ఆయా పోస్టుల్లోకి ఉద్యోగులు వస్తారని వివరించారు.

విత్తనాల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్

జగ్గయ్యపేట: 'నకిలీ విత్తనాలతో జర జాగ్రత్త' శీర్షికన సోమవారం 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి జగ్గయ్యపేట వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. ఏడీఏ భవానీ తన సిబ్బందితో కలసి జగ్గయ్యపేటలో విత్తనాలు విక్రయించే పలు దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభం నేపథ్యంలో నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రశీదులు అందించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో గుడ్డ సంచులలో విత్తనాలను అమ్మితే వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలని రైతులను కోరారు. విత్తనాలు విత్తే ముందు మొలకశాతం పరిశీలించుకోవాలన్నారు.



పేటలోని ఓ దుకాణంలో విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏ భవాని

జగ్గయ్యపేట మార్కెట్‌యార్డులోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో రైతులకు ఉచితంగా విత్తన పరీక్షలు చేస్తున్నందున, ఈసదుపాయాన్ని వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సరిపడ విత్తనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం స్టాకు, తదితర రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో ఏవో వరలక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● కమ్మేసిన కారుమబ్బులు



నందిగామ పట్టణంలో సోమవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడు కనిపించకపోగా ఆకాశమంతా మబ్బులు కమ్ముకోవడంతో వాతావరణం ఒకింత చల్లబడింది. అయితే ఉక్కపోత దెబ్బకు చిన్నారులు, వృద్ధులు ఇబ్బందిపడ్డారు. మబ్బులు కమ్మేయడంతో చల్లబడిన వాతావరణాన్ని పట్టణ ప్రజలు ఆస్వాదించారు.

– నందిగామరూరల్

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు



పేటలో ఫన్నీ గేమ్స్ ఆడుతున్న విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. వేసవి తరగతుల్లో భాగంగా చిన్నారులకు సోమవారం పలు అంశాలలో శిక్షణనిచ్చారు. తొలుత పుస్తక పఠనం చేయించారు. అనంతరం ఉపాధ్యాయుడు సీతారాం గణితంపై శిక్షణనిచ్చారు. విద్యార్థులతో ఫన్నీ గేమ్స్ ఆడించారు. కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు వినోద్‌బాబు, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు ఆధ్వర్యంలో విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. అనంతరం విద్యార్థులు కథలు చదివి వినిపించడంతోపాటు డ్రాయింగ్ వేశారు. క్యారమ్స్ ఆడారు. యోగా శిక్షకుడు సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. విద్యార్థులకు ధాన్యంపై శిక్షణనిచ్చారు.

నేడు మున్సిపల్ సమావేశం

జగ్గయ్యపేటఅర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లంతా తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

కార్యదర్శులతో సమీక్ష

వీరులపాడు: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన ఆయా పంచాయతీల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కూటమి పాలనలో తీవ్ర రాజ్యహింస



విలేకరులతో మాట్లాడుతున్న హఫీజున్నీసా ఫిరోజ్, జవ్వాజి నరసింహారావు తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: కూటమి ప్రభుత్వంలో రాజ్యహింస కారణంగా సామాన్యప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ బీసీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జవ్వాజి నరసింహారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఎల్లయ్య కుమారుడు హరికృష్ణపై దాచేపల్లి పోలీసులు దాష్టికానికి పాల్పడటం తగదన్నారు. ఈ చర్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే వారిపై హింసకు పాల్పడుతుండటం ఎంతవరకు సమంజసం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి ఆదేశాలతో పోలీసులు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పోలీసులే ప్రజలను హింసిస్తుండటం రాజ్యహింస కాదా? అని ప్రశ్నించారు. దాచేపల్లి పోలీసుల చర్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాయన్నారు. ఈ విషయాన్ని అన్ని వ్యవస్థల దృష్టికి తీసుకువెళతామని, హరికృష్ణకు న్యాయం జరిగేంత వరకు ఈ వ్యవహారాన్ని విడిచిపెట్టబోమని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ రిటైర్డ్ ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షుడు దర్శి వెంకటేశ్వర్లు, చిల్లకల్లు గ్రామ పార్టీ అధ్యక్షుడు దొంగల రాంబాబు, నియోజకవర్గ వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఇమ్రాన్ పాషా, ఆర్టీసీ ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో చిట్టిబాబు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే పాఠ్య పుస్తకాలు ఎమ్మార్సీకి చేరినట్లు ఎంఈవో చిట్టిబాబు సోమవారం తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో సోమవారం ఆయన పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. మండలంలోని 59 మండల, జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు ఒకటి నుంచి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలను అందజేస్తామని వివరించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థుల యూనిఫాం, స్కూల్ బ్యాగులు కూడా వస్తాయని తెలిపారు.

వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ పార్వతీశ్వరశర్మ

పన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భాషా పండితులు పరిశోధన ద్వారా తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రముఖ సాహితీవేత్త, ఔచిత్యమ్ పత్రిక ప్రధాన సంపాదకులు డాక్టర్ రాంభట్ల పార్వతీశ్వరశర్మ అన్నారు. కేబీఎన్ కళాశాల రీసెర్చ్ సెల్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో భాషోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం (ఫ్యాకల్టీ డవలప్మెంట్ ప్రోగ్రాం) జరిగింది. ఈ సందర్భంగా పార్వతీశర్మ శర్మ మాట్లాడుతూ పరిశోధన పత్ర రచనకు విస్తృతంగా అధ్యయనం చేయాలని తెలిపారు. పరిశోధనాంశం ఎంపిక, పరిశోధన విధానాలు, పద్ధతులు, సమాచార సేకరణ, పత్ర రచన తదితర అంశాలు మొదలు పూర్తి పరిశోధన పత్ర రచన చేయటం వరకు ప్రతి అంశాన్నీ ఉదాహరణ పూర్వకంగా వివరించారు. అధునాతన సాంకేతిక విధానాలను భాషా పరిశోధనకు, పరిశోధన పత్ర రచనకు అన్వయించే విధానాన్ని వివరించారు. ప్రామాణిక గ్రంథాల ఆధారంగా ఉపయుక్త గ్రంథ సూచి (బిబ్లియోగ్రఫీ) రచన వరకు అనుసరించాల్సిన విధానాలను ఉదాహరణలతో వివరించారు. పరిశోధన నాణ్యతను మెరుగుపరచడంలో చాట్ జీపీటీ వంటి అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ ఎలా ఉపయోగపడతాయో స్పష్టంగా వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.రామకృష్ణ, పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గ్రామీణ రోడ్లు



కుంగిన ముచ్చింతాల-కంభంపాడు రోడ్డు

పెనుగంచిప్రోలు: మండలంలో పలు గ్రామాల రోడ్లు గోతులమయమైన అత్యంత ప్రమాదకరంగా మారాయి. రోడ్లు కుంగిపోవటంతోపాటు పెద్ద పెద్ద గుంతలు పడటంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడతున్నారు. ఆయా రోడ్లలో ప్రయాణించే సమయంలో పలువురు ఇప్పటికే ప్రమాదాలకు గురికావడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మండల కేంద్రం పెనుగంచిప్రోలు నుంచి ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వరకు రోడ్డంతా పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. ఈ గంతల్లో పడి పలువురు వాహనదారులు గాయాల బారిన పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. విజయవాడ వైపు నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ రోడ్డు గుండానే ప్రయాణించాల్సి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈరోడ్డుకు తక్షణం మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వత్సవాయి మండలం లింగాల వద్ద రోడ్డు డైవర్షన్‌తో పెనుగంచిప్రోలు మీదుగా భారీ వాహనాలు వస్తుండటంతో ముచ్చింతాల-కంభంపాడు మార్గంలో రోడ్డు కుంగిపోయి ప్రమాదభరితంగా మారింది. తోటచర్ల నుంచి వెంకటాపురం వెళ్లే రోడ్డు కూడా సుబాబుల్ కర్ర రవాణా చేసే లారీల ధాటికి పలుచోట్ల రోడ్డు కకుంగిపోయింది. దీంతో ఈ రోడ్లపై ప్రయాణం రోజురోజుకు ప్రమాదభరింతంగా మారుతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్ల మర్మమతులకు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



గుంతలు పడిన పెనుగంచిప్రోలు-ముండ్లపాడు రహదారి



రోడ్డంతా కుంగిపోయి ఉన్న తోటచర్ల-వెంకటాపురం రోడ్డు

కళలతో మానసిక వికాసం

విజయవాడ కల్చరల్: కళలు మానసిక వికాసం కలిగిస్తాయని ఆంధ్రనాట్యాచార్యుడు పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు అన్నారు. శ్రీనటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య అధ్యాపకులకు, నృత్యకళాకారులకు బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ప్రధానంగా లైవ్ కార్యక్రమం నిర్వహించే సందర్భంలో తాళం, జతులు విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న విషయం మీద అవగాహన కల్పించారు. భారతీయ నృత్య సంప్రదాయంలో లైవ్ కార్యక్రమం ప్రధానమైందని రికార్డింగ్ ద్వారా నృత్యం చేయడం కన్నా లైవ్ ద్వారా చేయడం వల్ల నృత్యంలో జీవకళ కనిపిస్తుందన్నారు. మృదంగ అధ్యాపకుడు డాక్టర్ అమ్ముల ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో సాంస్కృతిక కళలకు పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. ఆంధ్రనాట్యాచార్యుడు రాయన శ్రీనివాసరావు, బాలోత్సవ్ ప్రతినిధి తులసీరావు, గుండు నారాయణరావు పాల్గొన్నారు. నిర్వాహకులు మృదంగం అధ్యాపకుడు అమ్ముల ప్రసాద్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

ఏఈవో దుర్గారావు ద్వారకా తిరుమలకు బదిలీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఏఈవో ఎం. దుర్గారావు ద్వారకా తిరుమల దేవస్థానానికి డెప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ దేవదాయ శాఖ అడిషినల్ కమిషనర్ టి.చంద్రకుమార్ ఆదేశాలు జారీ చేశారు. దుర్గగుడి నుంచి దుర్గారావు ద్వారకా తిరుమలకు బదిలీ కాగా, అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి వార్ల దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న బి.వెంకటరెడ్డిని దుర్గగుడికి డెప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు.

భగవద్గీతే శ్రీకృష్ణుని నిజ బోధ



కె.తాడేపల్లి(విజయవాడరూరల్): భగవద్గీతే శ్రీకృష్ణుని నిజ బోధ అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ సభ్యులు ప్రచారం చేశారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలో సోమవారం వారు ఇంటింటికి వెళ్లి త్రైత సిద్ధాంతం, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం తెలియజేస్తోందని, ప్రతి ఒక్కరూ కర్మ యోగ విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలనే ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ అధ్యక్షుడు జగీరపు సురేష్, సూరప్పడు, ఉమా, జయ, నరసమ్మ, లక్ష్మి, యశోద, చంద్రబాబు, చెంచు, గౌరినాయుడు, సత్యం, సీతప్పడు, లక్ష్మీభాయ్, పార్థు, భాగ్యశ్రీ పాల్గొన్నారు.